## క్లుప్తంగా

### ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న సర్పంచ్

**ముస్తాబాద్:** ఇంటింటా ఇంకుడుగుంతలు నిర్మించుకోవడంతోపాటు సామాజికంగా పలు ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టినట్లు ముస్తాబాద్ సర్పంచ్ గాండ్ల సుమతి తెలిపారు. ముస్తాబాద్‌లో పలువార్డుల్లో నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను శనివారం పరిశీలించారు. మురుగునీటి వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ఇంకుడుగుంతలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మానేరు కెనాల్, చెరువుల్లో మురుగునీరు చేరకుండా ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు.

### మిర్చిమార్కెట్



మిర్చి అమ్ముతున్న రైతులు

**వేములవాడ:** సీజనల్ వ్యాపారంలో భాగంగా మిర్చి చేతికందని రైతులు మార్కెట్‌లోకి తెచ్చి అమ్ముతున్నారు. వేములవాడ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా భగవంతరావునగర్ వీధిలో మిర్చి అమ్ముతున్నారు. దీంతో స్థానికులు, పరిసర గ్రామాలప్రజలు పెద్దఎత్తున చేరుకుని తమతమ అవసరాలకు అనుగుణంగా మిర్చిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. కిలో రూ.240 చొప్పున అమ్ముతున్నట్లు స్థానికులు తెలిపారు.

### బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేద్దాం



చీకోడులో సమావేశమైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

**ముస్తాబాద్:** బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. మద్దికుంట, మోహినికుంట, చిప్పలపల్లి, చీకోడు, బందనకల్ గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని సీఎం కేసీఆర్ పాత్రపై మరోసారి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 12న మద్దికుంట జీకే ఇన్‌ఫ్రాలో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న ఉద్యోగులు

**కోనరావుపేట:** మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డితండాకు చెందిన భుక్యా కిషోర్ కుటుంబానికి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన కిషోర్ రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. రెడ్డితండాకు చెందిన సర్పంచ్ లకావత్ ప్రమీల,ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బీమ్లా నాయక్, ప్రధానకార్యదర్శి హర్యనాయక్, కోశాధికారి రాజు తదితరులు రూ.60వేల నగదును ఇద్దరు పాపల పేరిట ఫిక్స్‌డ్ బాండ్, క్వింటాల్ బియ్యం అందించారు. ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా లక్ష్మణ్ ఏకగ్రీవం



**వేములవాడ:** వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పుట్టపాక లక్ష్మణ్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన నామినేషన్ల ప్రక్రియలో అధ్యక్షస్థానానికి పుట్టపాక లక్ష్మణ్ ఒక్కటే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల అధికారులు రేగుల దేవేందర్, కోళ్ల శ్రీనివాస్ లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సభ్యులు లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు.

# చెదిరిన తారు... పట్టించుకోండి సారూ..

- అడుగడుగునా గుంతలే
- ఎన్గల్ – మర్రిగడ్డ గ్రామాల మధ్య అధ్వానంగా రోడ్డు
- కష్టంగా మారిన ప్రయాణం
- పట్టించుకునే వారే లేరని ప్రయాణికుల ఆవేదన
- ప్రతిపాదనలోనే మగ్గుతున్న రోడ్డు నిర్మాణం



ఎన్గల్ బైపాస్ రోడ్డు తారు చెదిరి ఏర్పడిన గుంతలు

**చందుర్తి:** మండలకేంద్రానికి వెళ్లేందుకు బండపల్లి, ఎన్గల్ గ్రామస్తుల సౌకర్యార్థం వేసిన తారురోడ్డు చెదిరి పోయింది. భారీగుంతలు ఏర్పడి ప్రయాణానికి కష్టంగా మారింది. రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా మారిందని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళితే ప్రతిపాదనలు పంపించామని చెబుతూ దాటవేస్తున్నారు. రెండేళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రయాణికులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

### 15 ఏళ్ల నాటి తారు చెదిరింది

చందుర్తి మండల పరిధిలోని బండపల్లి, ఎన్గల్ గ్రామాల ప్రజలతో పాటు కోనరావుపేట మండలం బావుసాయిపేట, వట్టిమల్ల, కొండాపూర్, వెంకట్రావ్‌పేట, కోనరావుపేట గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగంలోఉంది. ఈ ప్రాంత ప్రజల రోడ్డు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు 2007 లో రూ.32.50 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బాగానే ఉన్నా రెండేళ్లుగా కురుస్తున్న భారీవర్షాలకు రోడ్డుపై వర్షపు నీరునిలిచి తారురోడ్డు ఎక్కడిక్కడ గుంతలు పడి చెదిరిపోయింది. అప్పటి నుంచి కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోడ్డుపై నడిచేందుకు కూడా వీలులేకుండా పోయింది. రోడ్డు చిద్రం కావడంతో బైకులు, ఆటోలు, బస్సులకు, ఇతర వాహనాలకు తిప్పలు తప్పడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రవాణా సౌకర్యాలు దూరం...

రెండు గ్రామాల మధ్య తారు రోడ్డు అడుగడుగున చెదరడంతో కనీసం నడిచేందుకు వీలులేకుండా ఉందని కిలో మీటర్ల పొడవునా రోడ్డు చెదరడంతో ఆటోలు, బస్సులు నడవక రవాణా సౌకర్యాలు దూరమయ్యాయి. దీంతో ఈ గ్రామాలపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం కష్టంగా మారింది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్న పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, పాలకులు ఈ రోడ్డు దుస్థితిపై స్పందించడం లేదు. ఎన్గల్ గ్రామంలో గల బైపాస్ రోడ్డు అరకిలో మీటర్‌కు పైగా చెదిరిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగుచేయాలని పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్గల్ నుంచి మర్రిగడ్డ గ్రామం వరకు 3.2 కిలోమీటర్ల రోడ్డు పొడువునా అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి.

### ఆర్టీసీ సేవలకు దూరమై ... కాలినడకే మార్గమై..

దారి పొడువునా గుంతలు ఏర్పడడంతో ఆర్టీసీ సేవలకు ప్రజలు దూరమయ్యారు. రోడ్డంతా గుంతలుగా మారడంతో బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ససేమిరా అంటున్నారు. దీంతో వీరికి ఆర్టీసీ సేవలు అందకుండా పోయాయి. మోకాలు లోతు గుంతల్లో బస్సులు నడిపితే వచ్చే ఆదాయం కన్న బస్సుల రిపేర్ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆర్టీసీ సేవలు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, మండల కేంద్రానికి వెళ్లే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, ఆటోలు రాకపోకలు సాగించేందుకు రోడ్డు సక్రమంగా లేక వ్యయ ప్రయాసాల కోర్చి వేములవాడ పట్టణం మీదుగా చందుర్తికి తిరిగి వస్తున్నారు.



ఎన్గల్, మర్రిగడ్డ గ్రామాల మధ్య గుంతల రోడ్డు



వరద నీటితో కోతకు గురైనా ఎన్గల్ రోడ్డు

### గండ్లను పూడ్చే దిక్కులేదు..

రెండేళ్లుగా కురుస్తున్న భారీవర్షాలకు రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టి కోతకు గురైంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఒక్కోచోట సైడ్ ఇచ్చేందుకు ఇబ్బందిగా ఉంది. కనీసం రోడ్డు కోతకు గురైనా ప్రాంతాల్లో తట్టెడు మట్టి పోసిన వారేలేకుండా పోయారు. తారు చెదిరి ఓవైపు ఇబ్బంది పడుతుంటే...మరో వైపు కోతకు గురైనా రోడ్డుపై సైడ్ తీసుకునేందుకు వాహనదారులు తిప్పలుపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, పాలకులు రోడ్లకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

### రోడ్డు బాగు చేయండి



తారురోడ్డు చెదిరి కంకర రోడ్డుపై తేలింది. పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై నడిచే ఆర్టీసీబస్సును రెండేళ్ల క్రితమే బంద్‌చేసింద్రు ఎప్పుడైనా మండలకేంద్రానికి మహిళా సంఘాల సభ్యులు వెళ్లాల్సి వస్తేకాలినడకన, లేకుంటే వేములవాడ మీదుగా తిరిగి వెళ్తున్నారు. అంటే సుమారుగా 24 కిలో మీటర్లు వెళ్లి వస్తున్నారు. ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందుల ను దృష్టిలో పెట్టుకుని రోడ్డు బాగుచేయండి.

– కుసుంబ జనార్దన్, యువకుడు, ఎన్గల్

### బైపాస్ రోడ్డును బాగుచేయండి



ఓట్లప్పుడు వచ్చి అదిజేస్తాం, ఇది జేస్తం అని చెప్పి ఓట్లు ఐపోయినంక పోయింద్రంటే మల్లీ ఇటు దిక్కు చూసే దిక్కుండరు. మా బాధలు ఎవరికి చెప్పుకుందామన్న ఎవరూ రాకపాయిరి. బాధలు పోతాయంటే అందరం కారుగుర్తుకు ఒటేత్తిమి. వేములవాడకు, చందుర్తికి ఎటూ పోవాలన్న ఎన్గల్ బైపాస్ నుంచి వెళ్లాలే. 500 మీటర్ల దూరంలో 100 గుంతలకు తక్కువ లేకపాయే. ముందుగాల గీ బైపాస్ రోడ్డునైనా బాగుచేయాలే.

– గడ్డం కుర్మ రాయమల్లయ్య, రైతు, బండపల్లి

### ప్రతిపాదనలు పంపించాం



ఎన్గల్–మర్రిగడ గ్రామాల మధ్య తారురోడ్డు అక్కడక్కడ చెదిరిపో యింది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరైతే తారురోడ్డు నిర్మించడంతో పాటు సైడ్ బరేమ్స్ నిర్మిస్తాం. నిధుల మంజూరుకు ఎదురుచూస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– వెంకటేశ్వర్లు , పంచాయతీ రాజ్ శాఖ, ఏఈ, చందుర్తి

## అకాల వర్షాలు కురువొద్దని ఆలయంలో ముడుపు

**గంభీరావుపేట:** యాసంగి పంటలు కోతకు వచ్చిన సందర్భంలో అకాల వర్షాలు పడొద్దని, పంటలు బాగా పండాలని కోరుతూ.. రైతులు గంభీరావుపేట మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో శనివారం ముడుపు కట్టారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి యాసంగిలో వరి పంటలు సాగుచేశామని రైతులు తెలిపారు. ఈదురు గాలులు, వడగళ్ల వానలతో ప్రతిఏటా పంటలు నష్టపోతున్నామని అలా జరుగకుండా దైవకృప ఉండాలని కోరుతూ ముడుపువేశామన్నారు. వరికోతల అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు విప్పుతామని రైతులుపేర్కొన్నారు. కార్యక్రమంలో అక్కపల్లి బాలయ్య, గోగు లింగం యాదవ్, పెద్దవేని వెంకటియాదవ్, చిట్టంపల్లి రాజయ్య, గంధ్యాడపు శంకర్, దోసల అభిలాష్, పెద్దవేని మల్లయ్య, రాజిరెడ్డి, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



ముడుపు వేస్తున్న రైతులు



### రవీందర్‌రావును కలిసిన నాయకులు

**బోయినపల్లి:** మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన రెడ్డిసంఘం నాయకులు శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావును ఆయన నివాసంలో కలిశారు. రెడ్డిసంఘం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందం రమేశ్, రెడ్డిసంఘం అధ్యక్షుడు గుడి రాజశేఖర్‌రెడ్డి, సంఘ నాయకులు ఉన్నారు.

## సెస్ భవనం కూల్చివేత

- భవనం శిథిలమవడంతో కూల్చివేత
- వినియోగంలోకి రాకముందే నేలమట్టం



శిథిలమైన సెస్ కార్యాలయ సొంత భవనం (ఫైల్)

**బోయినపల్లి:** మండలకేంద్రంలో సెస్ వినియోగదారుల సేవాకేంద్రం సొంత భవనం వినియోగానికి రాకముందే శిథిలావస్థకు చేరింది. ఈక్రమంలో శిథిలమైన సెస్ భవనాన్ని సెస్ వారు ఇటీవల కూల్చివేశారు. ఊరికి దూరంగా ఉందనే కారణంతో భవనం నిరుపయోగంగా ఉంది. చాలా ఏళ్లుగా అద్దె భవనంలో అరకొర వసతులతో సెస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. బోయినపల్లికి కిలోమీటరు దూరంలో వేములవాడ వెళ్లే దారిలో దాదాపు 30ఏళ్ల క్రితం 20గుంటల స్థలంలో సుమారు రూ.1.20 లక్షలతో సెస్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించారు. నిర్మించినప్పటినుంచి ఇప్పటి వరకు సొంత భవనం నిరుపయోగంగానే ఉంది. ఊరికి దూరంగా ఉండడంతో సెస్ భవనం కనీసం ప్రారంభానికి సైతం నోచుకోలేదు. దీంతో వృథాగా ఉన్న సెస్ భవనం తలుపులు, కిటికీలు, తదితర సామగ్రి సైతం ఎత్తుకెళ్లారు. భవనం పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో నూతన భవనం నిర్మాణానికి శిథిలమైన భవనాన్ని కూల్చి వేసినట్లు సెస్ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సహకారంతో నూతన భవన నిర్మాణానికి కృషిచేస్తానని సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ పేర్కొన్నారు.

## గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** గర్భిణులు నెలలు గడిచేకొద్ది ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ వహించాలని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలకేంద్రంలోని మార్కండేయ ఆలయ ఫంక్షన్ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక సీమంతాలు, అన్నప్రసాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్నిసద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాన చేశారు. కార్యక్రమంలో సర్పంచులు అంకారపు అనిత, గణప శివజ్యోతి, బొబ్బలమంజుల, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, సీడీపీవో అలేఖ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

### బంకించంద్ర చటర్జీకి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**చందుర్తి:** బంకించంద్ర చటర్జీ వర్ధంతిని చందుర్తి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కడారి నరేశ్, రాకం రవి, రొండి చంద్రకళ, మట్కం మమత, మాడపాటి స్వప్న , విద్యార్థులు పాల్గొన్నారు.

### ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ఎల్లారెడ్డిపేట:** మండలంతో పాటు వీర్నపల్లి ఉమ్మడి మండలాల ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జజ్జరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఇమ్మడి బాబు, నిమ్మల అశోక్, నారాయణ, ప్రధానకార్యదర్శిగా దండు శ్రీనివాస్, క్యాషియర్ బాలనర్సు, రైటర్ కనకరాజు, కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

### 'మంకు' కృషితో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం



బహుమతి అందిస్తున్న డీఈవో రమేశ్

**ఎల్లారెడ్డిపేట:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేస్తూ, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, అందాలని ఆంగ్ల మాధ్యమంలో బోధనతో ప్రభుత్వ పాఠశాలలు మరింత పటిష్టం చేయడానికి కృషి చేసిన ఘనత మంకు రాజయ్యకే సొంతమని డీఈవో రమేశ్ కొనియాడారు. దివంగత ఎంఈవో మంకు రాజయ్య జయంతి సందర్భంగా గుండారంలో శనివారం టీచర్స్ ప్రీమియం లీగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో రమేశ్ హాజరై మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. 13 మండలాలను నాలుగు జట్లుగా లీగ్స్ ఆడాయి. సర్థిపూల్ స్ట్రైకర్స్ విజేతగా, మానేరు మాస్టర్స్ రన్నరప్‌గా నిలిచాయి. మంకు శైలజ, మంకు లాస్య, శర్మన్నాయక్, పర్ష హన్మాండ్లు, బుర్క గోపాల్, మైలారం తిరుపతి, పంజాల వెంకటేశ్వర్లు, దేవత ప్రభాకర్, నిర్వాహకులు జక్కని నవీన్, జయకృష్ణ, కొండి కొప్పుల రవి, భాస్కర్‌రెడ్డి, రవీందర్, వంగ తిరుపతి, సంతోష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### గ్రీన్ కలర్స్‌డే

**వీర్నపల్లి:** మండలంలోని రంగంపేట జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రీన్ కలర్‌డే శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గ్రీన్‌కలర్ డ్రెస్‌లు వేసుకున్నారు. కూరగాయలు, పండ్లు, ప్రదర్శించారు. విద్యార్థులు రంగులను గుర్తించేందుకు ఈ కలర్‌డే ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం అన్నారు.

### విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న సాయి

**బోయినపల్లి:** మండలకేంద్రంలోని హైస్కూల్‌లో పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శనివారం రత్నంపేటకు చెందిన యువ నాయకుడు కుంభం సాయికుమార్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీచేశారు. సుమారు 200 మంది విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో గుంటి శంకర్, కన్నం మధు, గడ్డి మల్లేశం, గాజుల పాటి రాంబాబు, రాజూరి కిరణ్, కృష్ణమూర్తి, వంశీ, సాయి, ప్రసాద్, జేపీ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం



దుబ్బాక రమేశ్

**తంగళ్లపల్లి:** మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దుబ్బాక రమేశ్ ఈనెల 11న నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలకు రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీచేసినట్లు ఆయన తెలిపారు. తనకు రాష్ట్రస్థాయి బాధ్యతులు అప్పగించిన మంత్రి కేటీఆర్‌కు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

### అర్హులకు ఇళ్లు కేటాయించాలి

**ఇల్లంతకుంట:** మండలంలోని పెద్దలింగాపూర్, పొత్తూరు, ఇల్లంతకుంట, కందికట్కూర్, ఓబులాపూర్ గ్రామాల్లో రెండేళ్ల క్రితమే ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లుకట్టించిందని, ఇప్పటి వరకు లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు కేటాయించలేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మ్యాకల మల్లేశం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇళ్లులేని లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

### పరామర్శ

**సిరిసిల్లఅర్బన్:** పట్టణంలో ఇటీవల పలువురు అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి శనివారం పరామర్శించారు. సీపీఐ నాయకులు బూర శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు దండు భూమయ్య గడప బాలమ్మ ఇటీవల మృతిచెందారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌన్సిలర్ రవికుమార్, రాగుల జగన్, గోశిక శ్రీనివాస్, కొండ శంకర్ తదితరులు ఉన్నారు.

### యాదగిరి గుట్టకు ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు

**ఎల్లారెడ్డిపేట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనృసింహ స్వామిదర్శనానికి ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం నుంచి ఆదివారం ఉదయం 7 గంటలకు సుమారు 1500 మంది గ్రామస్తులు 30 బస్సుల్లో తరలివెళ్తున్నట్లు సర్పంచ్ నెవూరి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామికి మొక్కు తీర్చుకునేందుకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ యాదగిరి గుట్టను ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్, వార్డుసభ్యులు ద్యాగం లక్ష్మీనారయణ, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, జవ్వాజీ లింగం, మాజీ వార్డుమెంబర్ బందారపు బాల్‌రెడ్డి, బాధ రమేశ్, నాయకులు గన్న మల్లారెడ్డి, కోలమోహన్, మద్దుల పద్మారెడ్డి, జవ్వాజి కోమురయ్య, రేడియో రమేశ్ పాల్గొన్నారు.

### శ్రీవారి సన్నిధిలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

**సిరిసిల్లటౌన్:** శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో రెండో శనివారం సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.